# కాలనాగు

"అయ్యో పాపం ! మనిషి ఎర్రగున్నడు. బట్టలు తెల్లగున్నై. గీ బస్టాండ్ల తువ్వాల పరుచుని గిట్లా కూచున్న డెందుకో !"

"పాపం ! బిచ్చమడగలేక, గోళ్లు గిచ్చుకోలేక గిట్లా కూకున్నడు. ఎవరికి తోచింది వారు వేస్తే సరి... !"

"అరెరే ! వయసు మీరినట్టుంది. మాగి మడతలు పడ్డ మామిడి పండోలుంది మొకం. చెట్టుకింద తపస్సు క్కూచున్నడేమో...!"

"తప్పస్సు ఊర్లె జేస్తరా ! ఊరవతల కొండలల్ల, గుట్టలల్ల జేస్కుంటర్"

"ఏందో కలి మాయ ! బిచ్చ మడుక్కునేటోల్ల గ్గూడా బింకమేనాయె ! నోరు దెరువడు, కన్నెత్తి చూడడు !"

"గవన్నీ మనకెందుకూ ? తోచింది వేస్తే సరి !"

ఆ బస్టాండొక జనారణ్యం. ఓ పక్కన చెట్టుకింద కూర్చున్న భూపతి కనురెప్పలు తటాలున పైకి లేచాయి. జనాలు చూస్తూ పోతున్నారు. వాళ్లెవ్వరూ అతనికి తెలియదు. జనసముద్రం లోంచి కొందరు పావలానో, అర్థరూపాయో విదిలించి వెళ్లిపోతున్నారు.

మ్యాట్నీ సినిమా లొదిలారు. కొందరు చూడకుండా పోతున్నారు. మరికొందరు చూసినా చూడనట్టే వెళ్లిపోతున్నారు. ఇద్దరు పల్లెటూరు యువకులు తాము చూసొచ్చిన సినిమా కబుర్లు చెప్పుకుంటూ వచ్చి అతని పక్కన నుంచున్నారు. చూపులు దించుకున్నాడు.

"వీడో దొంగ సన్నాసిరా !"

"అవును... సమయం చూసి సంధ్యవార్చినట్టు వచ్చిపోయేటోల్ల నిట్లా జూచి వెంటబడ్తడు!'

"అవున్రా... పట్నంల పగలి దొంగలెక్కువైండ్రు !"

"మరి మనం గిక్కడెందుకూ ? మనూరి బస్సుకాడ నిల్చుందాం, పద !"

అన్ని వినపడినా ఏమీ వినపడనట్టే ఉండిపోయాడు భూపతి. వచ్చేపోయేవారిలో ఇద్దరు ముగ్గురు భూపతిని గుర్తుపట్టారు. వెంటనే కామెంట్స్‌లోకి దిగారు.

"ప్చ్... ఆనాడు ఆ దర్పమే వేరు. అలగా జనాలను అరికాలుకింద తొక్కి పెట్టిండు... కాలం మారిపోయింది !"

"వామ్మో ... ఈయన భూంపల్లి భూపతి దొర గదా ! వాళ్ల తాత ముత్తాతల నాటినుండి

అక్కడ నైజాముకు సలాంలు గొట్టి, ఇక్కడ పల్లె జనాలను గులాముల్ని జేస్కున్నరు...!"

"ఒక్క భూంపల్లి ఊరేందీ ! చుట్టపక్కలున్న ఊర్లన్నీ పండుమంటే పండుకున్నై, లేవుమంటే లేచినై.., పల్లెల భూములన్నీ కబ్జా పెట్టిండ్రు."

"కానీ... జీతగాళ్లందరికీ ఈయన గుడిశెలు కట్టించి ఇచ్చిండు."

"తాను మాత్రం మూడంతస్తుల మేడ గట్టుకున్నడు."

"పని బాగాజేసినోల్లకు తిన్నంత తిండి పెట్టిండు."

"చాతగాక పంజెయ్యనోళ్ల పని పట్టిండు...!"

"ముగ్గురు పిల్లల్ని బాగా చదివించిండు."

"తన పిల్లల్ని తాను చదివించిండు. మంది పిల్లలతోని ఎట్టిచాకిరీ చేయించుకున్నడు."

"ఓ కొడుకుని అమెరికా పంపించిండు."

"ఆఁ... అందరి కష్టం దోచుకుని పెద్ద కొడుకుని అమెరికా పంపించిండు. చిన్నకొడుకైతే ఎస్సెస్సీ ఏడుసార్లు ఫెయిలైండు. అతనికి పెండ్లి జేసి అత్తగారింటికి దోలిచ్చిండు !"

"ఛ ఛ?! ఆ పిల్లగాడేమన్నా ఆడపిల్లనా అత్తగారింటికి దోలిచ్చేందుకూ ! ఊర్లె బాధలు పడలేక అక్కడుంచిండు !"

"ఒకే ఒక కూతురాయె. ఆమెకు రంగరంగ వైభోగంగా పెండ్లి జేసిండు."

"అవును, అల్లుడు పెద్ద కంట్రాక్టరట. హైద్రాబాదులుంటరట!"

మనిషి మంచి చెడుల్ని మానవ సమాజం గుర్తిస్తుందని ఎప్పుడో విన్నాడు. ఇప్పుడు అనుభవానికొస్తోంది. ఎప్పుడూ భుజమ్మీద వేళ్లాడే తువ్వాలును నేలమీద పరిచి కూర్చున్నాడు. అంతరాళాల్లోని ఆవేదన పైకొచ్చి పద్మాసనం వేయనివ్వలేదు. బుర్రలో భూగోళం గిర్రుమంటోంది. చూపులు నేలకతుక్కుపోయాయి.

ఆనాటి లక్షాధికారిని... నేడు భిక్షాధికారి నెలాగైనాను ? నా పిల్లలకు నేనేం తక్కువ చేశాననీ ?

ఔను... ప్రజల్ని పడుకోబెట్టి వాళ్ల వీపులమీద పిల్లలను నడిపించాడు. పిల్లల భవిష్యత్తు బంగారం కావాలని చేయరాని పనులెన్నో చేశాడు.

నేడు పల్లె మేల్కొంది. జనజాగృతి హుంకరించి ప్రతీకారం తీర్చుకుంటానని పట్టుపట్టింది. నాడు పులిలా గాండ్రించినా, నేడు కుక్కిన పేనులా కిక్కురుమనలేదు. కాలం కలిసిరానప్పుడు పక్కలున్న నల్లపిల్లి నాగుపామై కాటేస్తుంది. పిల్లల పెళ్లిళ్లై ఇంటికి దూరం కాగానే భార్య భగవంతుని దగ్గరికి చేరుకుంది. తను ఒంటరి వాడైపోయాడు. ఊళ్లో బెదిరింపులు, వేదింపులు, వెటకారాలు, ఛీత్కారాలు... భరించడం అసాధ్యమైంది.

చరాస్తులు పిల్లలు లాక్కెళ్లారు. స్థిరాస్తులమ్ముకుని చింతలు లేకుండా గడపాలనుకున్నాడు. తుపాకి తూటాలకు, బాంబుల మోతలకు తట్టుకోలేక అర్ధరాత్రి ఊరుదాటి పట్నం చేరుకున్నాడు.

అస్తులమ్ముకోలేక పోయాడు. కౌలుదార్లు తన భూముల్ని వారే సాగుచేస్కుంటూ యజమానులుగా ప్రకటించుకున్నారు. ఇల్లు అమ్మేద్దామంటే కొనే వారేరి ? కొన్నవారి కొంప కొల్లేరై పోతుందని పోస్టర్ల ప్రచారం జరిగిందప్పటికే.

మరి రోజులు గడిచేదెట్లా ? పట్నంలో తను ఎవరింట్ల ఉన్నా ఆ ఇంటి యజమానికి ప్రమాదమని సంకేతాలొచ్చినాయి. పెద్దకొడుకు అమెరికా ఉంటేనేం ? చిన్న కొడుకున్నాడు గదా! ఆనాడు పెల్లిలో... కన్యాదానం చేసేటప్పుడు తన మామగారు వేలికి తొడిగిన సన్నని ఉంగరం... అన్నీ పోయినా అది మాత్రం మిగిలింది. దాన్ని తాకట్టుబెట్టి వరంగల్ వెళ్లాడు. కొండంత ఆశతో కొడుకింటికి చేరుకున్నాడు. కొడుక్కూ, కోడలికీ, మనవడు, మనవరాళ్లకు ఏవేవో కొనేశాడు వెళ్లేప్పుడు.

కొడుకు బంగళా కోటలాగుంది. కోడలు లక్ష్మీదేవిలాగుంది. కానీ ... కోపమొస్తే మహంకాళై పోతుందని తెలీదు. మొదటి మూడు రోజులూ మమూలుగానే గడిచినాయి. ఆ తర్వాత ముక్కూ మూతులు తిప్పడం గమనించాడు. ఓ రోజు కొడుకు అడిగాడు.

"నాన్నా ! ఇన్ని రోజులు నువ్విక్కడుంటే అక్కడ ఇంటి దగ్గర పనులన్నీ ఎట్లా ?"

"ఇంటి వద్ద పనులా ?" నవ్వాలో, ఏడవాలో అర్థ కాలేదు.

"అక్కడేముందనీ? ఇల్లాలు లేని ఇంట్ల దయ్యాలాడుతుంటాయి !"

"కానీ... అమ్మ తిరిగి రాదు గద నాన్నా !"

"అవును. శాస్త్రవిజ్ఞానం ఎంత అభివృద్ధి సాధించినా చచ్చిన మనిషిని బతికించేదాకా ఎదగలేదురా !"

"అందుకే కాలానికి కట్టుబడి ఇంట్లనే ఉండాలె... పనులు చేయించుకోవాలె !"

"పనులు చేయించి ఇంకా సంపాదించడం మెందుకూ ?"

"ఎప్పట్లాగే ఏటేటా పంట అమ్మి డబ్బు మాకు పంపాలె !"

అరికాలి మంట నెత్తికెక్కింది. "నువ్వో అమాయకుడివనుకున్నానురా !"

"మాయకుడినో... అమాయకుడినో..."

"కానీ, ఇప్పుడు మన ఇల్లు మనది గాదు. మన భూములు మనవి కావు !" పరిస్థితి అంతా చెప్పేశాడు. "అయినా... ఈ వయసులో నాకోసం మీరు కష్టపడాల్నా, లేక మీ కోసం నేను కష్టపడాల్నా ?" పొత్తి కడుపులోని సముద్ర మథనాన్నాపుకుంటూ అడిగాడు.

"ఎవరికోసం ఎవరు కష్టపడినా ఇతరులకోసం కాదు గద మావయ్యా !" తలుపు చాటుకు నుంచున్న కోడలు రంగప్రవేశం చేసింది.

"నిజమే... కానీ ఒంటరి పక్షిని ... ఊర్లె ఉండలేను. ఒంట్లో సత్తువ లేదు. ఇహ ఇక్కడే ఉండిపోదామనుకుంటున్నానమ్మా ! మీలో నే నొక్కణ్ణి...!"

కోడలు కరుకు చూపులు కొడుకు గుండెలకు గుచ్చుకున్నాయి. అతడు దిగ్గున లేచి వెళ్లిపోయాడు. కోడలు మూతులు దిప్పుడు, కొడుకు సూటిపోటి మాటలు, మనవడు మనవరాలిని దగ్గరికి రానివ్వకపోవడం... రాను రాను బతుకు గంజిలో ఈగలాగైపోయింది.

మరో నెల రోజులు గడిచాయి.

ఒక రోజు ఉండబట్టలేక బడినుండి వస్తున్న మనవని కెదురేగి పరిష్వంగములో బంధించాడు. క్షణకాలం కమ్మని అనుభూతి.. ఒళ్లు పులకరించింది.

"అదేం పని? దరిద్రపు నిర్వాకం.."

కోడలొచ్చి పసివాణ్ణి లాక్కుపోతూ, "వెధవా ! ఈసారి తాతయ్య దగ్గరి కెళ్తే తోలు ఒలిచి ఉతికిపారేస్తా !" లెంపలు వాయించింది. ఆ దెబ్బలు తనమీదే పడ్డట్టనిపించింది.

"వాన్నట్లా కొట్టవద్దమ్మా !"

"ఆ... కొట్టొద్దు... ముద్దుబెట్టుకోవాలె !" వెటకారంగా చేతులు మూతులు తిప్పేసింది. "అయినా కూతురు కూతురంటూ మూటలుగట్టి పంపిస్తిరి గదా ! వెళ్లి ఆ గారాల కూతురు దగ్గరుంటే తప్పా !" మహంకాళైపోయింది.

అవును... నా గుండెల మీద పెరిగిన గారాలపట్టి తప్పకుండా నా గుండెమంటల నర్థం చేసుకుంటుంది.

మర్నాడు కూతురింట్లో ప్రత్యక్షమయ్యాడు.

కూతురు ఆప్యాయంగా పలుకరించింది.

"తాతయ్యా!..." అంటూ పిల్లలు చుట్టేశారు. కూతురు మెడ... ఆమె తల్లి నగలతో ధగధగా మెరిసిపోతోంది.

"నా తల్లే... కొడుకులకంటే నయం !" అనుకున్నాడు.

మిగిలిన డబ్బులతో స్వీట్లు కొనిపెట్టాడు.

మొదటిరోజు అల్లునితో సహపంక్తి భోజనం, లోకాభిరామాయణం. రెండోరోజు మనవడు, మనవరాలితో భోజనం, జోకాభిరామాయణం. మూడో రోజు ఒంటరి భోజనం.

"తాతయ్యా ! నా కీసారి తప్పకుండా సైకిల్ కొనిస్తావు గదూ !" తుంటరి మనవడి డిమాండ్.

వారం గడిచింది.

"నాన్నా !" కూతురు అడిగింది. "మనూళ్లో పరిస్థితులు బాగాలేవన్నావు కదా ! అన్నయ్యలు ఎవరి దారిన వాళ్లున్నారాయె. అక్కడి ఆస్తులన్నీ అమ్మేసి ఇక్కడే మాతోపాటు నువ్వూ దర్జాగా ఉండొచ్చు కదా !"

"అయ్యో తల్లి ! ఆస్తులమ్ముకునే అదృష్టం కూడానా !" విషయమంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

మర్నాడు అల్లుడు డ్యూటీ కెళ్తూ, "మీరు ఏ ట్రైన్ కెళ్తారో చెబితే టికెట్ కొనుక్కొస్తా మావయ్యా !" చేతులు చాచాడు డబ్బుల కోసం.

"అంటే...!" చూపులు కూతురువైపు మళ్లినాయి.

"అవున్నాన్నా ! నేనే చెప్పిన."

గుండె నరాలను కొత్త బ్లేడుతో కోస్తున్నట్టనిపించింది.

"అది కాదమ్మా, ఊరెల్లి నేనేం చెయ్యాలె ?"

ఎప్పుడు వికసిత కమలం లాగుండే కూతరు మొహం రేకులు మూసుకున్న కలువలాగైంది.

"ఉట్టిగొట్టుకుని ఊరేగు... లేదా, ఉరేసుకుని చావు !" మూతి మూడు వంకర్లు తిరిగింది.

"ఆడపిల్ల సొత్తు తింటే అష్టమహా పాతకాలంటుకుంటై. పురుగుల బడి ఛస్తరు !"

ఇది నాకూతురేనా ? ఒళ్లో కూర్చుని ఓనమాలు దిద్ది, ముప్పయ్యెకరాలమ్మించి మూడు ముళ్లు వేయించుకున్న... నా కూతురేనా ? తల్లి దశదిన కర్మనాడు నగలన్నీ మూటగట్టుకుని "మా నాన్నను ఒంటరివాణ్ణి చేశావమ్మా !" అంటూ తల్లిపటం ముందు తల్లడిల్లిపోయిందీ కూతురేనా ?... ప్రపంచం తలకిందులైంది. కాళ్లకింది నేల వేగంగా పరుగెడుతోంది.

"అమ్మా... ! తాతయ్య నుండనీయవే ! ఈ రోజు నాకు సైకిల్ కొనిచ్చి రేపు వెల్తాడే!" మనవడి గోల. కూతురు, అల్లుడు కళ్లతో ఏం మాట్లాడుకున్నారో ఏమో... అల్లుడు వెళ్లిపోయాడు.

సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ వైపు వెళ్లాడు. రంగురంగుల పూలు, చిరునవ్వులు చిందిస్తున్న జనసమూహాలు, వృద్ధ దంపతులు... అంతా కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లలతో ఆడుకుంటున్నారు. మరి తనో... ఒంటరి... ఒంటరి. ప్రపంచం తనను వెలివేసింది...

తిరిగి ఇంటికవొచ్చేసరికి వసారాలో ఎవరూ లేరు. గదిలోంచి మాటలు వినబడుతున్నై.

"వెధవా ! తాతయ్యని ఉండనీమ్మా అని ఆరిందలా అంటావా !" అల్లుని బెదిరింపు.

"అదికాదు, నాన్నా ! తాతయ్య చాలా మంచి తాతయ్య గదా !" మనవని భయం.

" నీ బొంద !" అది కూతురు గొంతే. "వచ్చిన ముసలాయన చచ్చేదాకా ఇక్కడే ఉండేట్టుందిరా !"

"ఆస్తిపాస్తులన్నీ కొడుకుల కప్పజెప్పిండేమో... గొడ్డు మనిషోలె వట్టి చేతుల్తో వచ్చి నాటకాలాడుతున్నడు. చూడూ, మీ నాన్నను నువ్వేమన్నా వెనకేసుకొచ్చావో..."

"అదికాదండీ..."

"ఏది కాదు ?" అల్లుని గొంతులో దురుసుదనం. "నువ్వు కథలు చెప్పొద్దు. ఆ ముసలాణ్ణి పొద్దున్నే తరిమెయ్యాలె... ఆఁ..!"

"సరే మీ ఇష్టం !"

"ఒరేయ్ ! నువ్వు తాతయ్య గురించి ఏమన్నా మాట్లాడ్తే... చమ్డాలూడిపోతై, జాగ్రత్త!"

"అమ్మో... కొట్టకు, నాన్నా"

గదిలో గందరగోళం, మదిలో అల్లకల్లోలం.

వీళ్లంతా నా బంధువులేనా ! కాదు... రాబందులు... పెడితే పెళ్లికోరుతారు లేకపోతే చావు కోరుతారు. అయినవాళ్ల నాశ్రయించడంకంటే అడుక్కుతినడం మేలు... అరక్షణం కూడా ఉండబుద్ధి కాలేదు వెంటనే బయటికొచ్చేశాడు. ట్రైన్‌లో టిక్కెట్ లేకుండా ప్రయాణించి ఈ ఊరు చేరుకున్నాడు...

"ఏయ్ ! నువ్వు జైలుకు పొయ్యేటోనివా లేక జైలు నుండి తప్పించుకొచ్చినోనివా !" పోలీస్ లాఠీ వీపుమీద తచ్చాడుతుంది.

అరెరే... చీకటి వడిందే ! ... తువ్వాలు సర్దుకోబోయాడు. అంతకుముందే కానిస్టేబుల్ డబ్బు లేరుకుని జేబులో వేసుకున్నాడు.

"నువ్వెవనివిరా ! తెల్లబట్టలు నల్లవడినై..." లాఠీ గదవకిందానింది.

"నేనూ... నేను భూపతిని..."

"ఏ రాజ్యానికి ?..." వెకిలి నవ్వు.

"....." కోపం, అసహ్యం... కానీ, దారి లేదు.

"కొంగజపం జేస్కుంట కూకుంటే పోలీసోళ్ల కండ్లల్ల వడననుకున్నవా? తియ్... ఎన్ని పాకెట్లు గొట్టినవ్... ఎక్కడ దాచినవ్ ?"

"నేనా... పిక్ పాకెటర్నా... !

"మరి నేనా ? అరేయ్..! పోలీసోడంటే చిర్రాగోనే ఆడుకునే పోరగాడనుకున్నవా ? నువ్వీ ఊరికి కొత్తగొచ్చినట్టుంది. నీ గ్యాంగు ఎక్కడుందిరా ?"

"గ్యాంగా?"

"ఆఁ... పొద్దుందాక బస్టాండ్ల పాకెట్లు గొట్టుడు, తెల్లందాక బంగ్లాలల్ల వడి దోచుకునుడు, అరేయ్... ! మీ గజదొంగల గోత్రాలన్నీ మాకు దెల్సురా!" ఆ నవ్వుకూ, షోడాబుడ్డి పగలిన శబ్దానికీ ఏమాత్రం తేడా లేదు. లాఠీ వీపుమీదికొచ్చింది.

ఇంతటి అవమానం ఈ జన్మలో జరగలేదు.

"ఏయ్ ! మాటలు జర జాగ్రత్తగ రానీ!"

ఆత్మాభిమానం కట్టలు తెంచుకుంది. "నువ్వు రిటైరయ్యేదాకా తీసుకున్న జీతాన్ని లెక్కగట్టినా నా మామిడితోటంత విలువ జెయ్యదు !"

"ఆహాఁ..." వీపుమీది లాఠీ గాల్లోకి లేచింది. "అయితే ఆ విలువలన్నీ మా స్టేషన్ల జెప్పుకుందువు రాబే...!" చెంప ఛెళ్లుమంది. గుండె గుభేల్మంది. బలి ఇచ్చే మేకపోతును చెవులుబట్టి లాక్కెళ్లు తున్నట్టు చేతులుబట్టి బలవంతంగా లాక్కెళ్లాడు.

అతని ఒంట్లోని సత్తువంతా ఎటు మాయమైందో...

ఎరగని ఊళ్లో మొరగని కుక్కపిల్లలాగైంది పరిస్థితి. పోలీస్‌స్టేషన్లో తెలిసిన వారెవ్వరూ లేరు. పట్టుకెళ్లిన కానిస్టేబుల్ యస్సైకేం జెప్పాడో ఏమో... యస్సై రెచ్చిపోయాడు.

"నువ్వే గ్యాంగులున్నవ్ ? నీ లీడరెవడు ? అడవిలున్నరా, లేక ఇదే పట్నంల అండర్ గ్రౌండులున్నరా... ?" ప్రశ్నల వాన కురిపిస్తూ వీపుమీద గుద్దులు వడ్డించాడు. జేబులన్నీ వెతికించి చేతులు దులుపుకున్నాడు. చివరికి పళ్లు కొరుకుతూ...

"నీ వాడెవడన్నా ఉంటే చెప్పు... పిలిపిస్తా !" అన్నాడు.

ఒళ్లు హూనమైపోయిందప్పటికే

తన కెవరున్నారు ? ఎవర్ని పిలిపించుకోవాలి ? ఏడుపు తోసుకొచ్చింది. "అరె బద్మాష్... ఏడ్చే మొగోణ్ని నమ్మద్దు..." పోలీసు లాఠీలు ఒంటిమీదాడుతున్నాయి.

ఈ జన్మలో ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. నరక మలేది ఎక్కడో

లేదు... ఇక్కడే... ఈ స్టేషన్లోనే ఉంది... ఎన్ని తరాల పాపాలో... పగ దీర్చుకునేందుకు పోలీసుల రూపాల్లో అవతరించినై. భగవంతుడా ! మా తాత, తండ్రులు భూస్వాములై చిల్లరగాళ్లను వాయించిండ్రు. నేను మాటల్తో బెదిరించాను గానీ చేతుల్తో ఒక్కణ్ణి కూడా కొట్టలేదు. తాతముత్తాతల పాపాలకు ప్రాయశ్చిత్తం ఈ ఒక్క రాత్రే లభించింది. ఇక చాలు... ఎన్నడూ కంట తడి ఎరుగని భూపతి కళ్లు ధారాపాతాలైపోయినై.

మర్దన జేసిన పోలీసులు అర్ధరాత్రి మాయమయ్యారు. మిగిలిన రక్తాన్ని దోమలు యధేచ్ఛగా పీల్చుకున్నై. రాత్రంతా యమయాతన... ఆకాశం అప్పుడే కళ్లు తెరుస్తోంది. కొద్దిసేపట్లో తెల్లవారవచ్చు. సెంట్రీని పిలిచాడు. సెంట్రీ నైట్ డ్యూటీ కానిస్టేబుల్‌ను లేపి తీసుకొచ్చాడు.

“ఏందిరా బాడ్కొవ్... బంగారమసొంటి నిద్ర ఖరాబు జేసినవ్!” లాకప్ రూంముందు గుర్రుమన్నాడతడు.

“దొడ్డికి...” రెండు వేళ్లు చూపించాడు.

“అమ్మ నీయమ్మ ...! తెల్లారినాదిరా...” తిట్ల పురాణం విప్పి తాళం తీశాడు. అంతే... బయటికి రాగానే భూపతికి ఎక్కడ లేని ధైర్యం .... శక్తినంతా కూడదీసుకుని కాళ్లకు పంపించాడు. మెరుపులా పరుగు లంకించుకున్నాడు. ఇలా జరుగుతుందని ఊహించని నైట్ డ్యూటీ కానిస్టేబుల్ నిద్ర మత్తు వదిలింది.

“ఒర్నియవ్వ... అరేయ్, దొంగ నాకొడకా...” అంటూ వెంబడించాడు.

ముందు భూపతి, వెనక కానిస్టేబుల్... పరుగు... ఒక్కటే పరుగు. ఎదురుగా లారీ పరుగెత్తుకొస్తోంది. అతి వేగంగా పరుగెత్తుకొస్తోంది... ఇన్నేండ్లు దొరబాబునై బతికి ఇపుడు దొంగనైపోతి. భగవంతుడా ! ఈ జన్మకిది చాలు. ఇంకా నేనేం సాధించాలె ? ఎట్లా సాధించాలె ! ... భూపతి పరుగు ఆగలేదు.

“ఆగురా... అరేయ్... చస్తావురా !” కానిస్టేబుల్ కేకలతో దిక్కులు పిక్కటిల్లుతున్నాయి.

అప్పుడే ప్రపంచాన్ని చూడాలనుకుంటున్న బాలభాస్కరుని నునులేత కిరణాలు మబ్బుల మాటునుండి తొంగి చూస్తున్నాయి.

కన్ను మూసి తెరిచేలోగా నడిరోడ్డుమీద పరుగెడ్తున్న నిండు లారీ భూపతి గుండెలమీంచి వెళ్లిపోయింది. పోలీసు పక్కకు తప్పుకున్నాడు.

భూపతి రక్తం మడుగులోంచి ఉదయిస్తున్న అరుణ కిరణాలను చూసిన కానిస్టేబుల్ సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయాడు.

**‘ఆంధ్రప్రభ’ సచిత్ర వారపత్రిక ... 22 మే 2000**